

సుప్రజా రామా...

సకల గుణాలను కలిగిన ఉత్తమ పుణ్య పురుషుడు, లోక హితమే అభిమతంగా పాలన సాగించిన జగదభిరాముడి కల్యాణం ఆదివారం కమనీయంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ధర్మపరిరక్షణకు ప్రతీక అయిన రఘునాథుడు నేటికీ కలియుగ వైకుంఠం తిరుమలలో ప్రత్యేక పూజలందుకుంటున్నారు. శ్రీరామనవమి సందర్భంగా గురువారం ఆస్థానం నిర్వహిస్తున్న తరుణాన ప్రత్యేక కథనం.

- 8లో



డీడ్ ఇస్తేనే బాండ్లు

- టీడీఆర్‌లకు గిఫ్ట్ డీడ్‌లు ఇవ్వాల్సిందే
- అప్పుడు అడ్డగోలుగా ఇవ్వడం వల్లే ఇప్పుడీ తిప్పలు
- రెండో రోజు మేళాలో 67 మందికి ఆన్‌లైన్
- వీటిలో 48కి గ్రీన్ సిగ్నల్ ● నేడు మేళాతోపాటు ఫీల్డ్ విజిట్

తిరుపతి, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి) : 'డీడ్ ఈజ్ నీడ్..' టీడీఆర్ బాండ్ల కోసం వస్తున్న బాధితులకు అధికారుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్న సమాధానమిది. టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధ్రువీకరణ స్పెషల్ డ్రైవ్ రెండో రోజు శనివారమూ కొనసాగింది. సెలవు దినమైనప్పటికీ పెద్దఎత్తున కార్పొరేషన్ కార్యాలయానికి టీడీఆర్ బాధితులు రావడం కనిపించింది. మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం ఆస్తులు పోయినవాళ్ల నగరపాలక సంస్థకు గిఫ్ట్ డీడ్ ఇచ్చివుండాలని, ఇవ్వనివారు ఇప్పుడైనా ఇస్తే ఆన్‌లైన్ లాగిన్ చేస్తామని చెప్పడంతో తొలుత నిరుత్సాహపడ్డారు. తర్వాత గిఫ్ట్ డీడ్‌లకు అంగీకరించారు. గతంలో గిఫ్ట్ డీడ్‌లు ఇవ్వనివారికి కూడా టీడీఆర్ బాండ్లు ఇచ్చారని పలువురు అధికారుల ముందు ప్రస్తావించారు. అప్పుడు అడ్డగోలుగా ఇవ్వడం వలనే ఇప్పుడీ తిప్పలు తప్పడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రెండో రోజు స్పెషల్ డ్రైవ్‌కు వచ్చిన 67మందికి ఆన్‌లైన్లో లాగిన్ చేశారు. వీటిలో 48 దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టౌన్‌ప్లానింగ్ లాగిన్‌లో వీటిని పొందుపరిచారు. వీటికి త్వరలోనే టీడీఆర్ బాండ్లు జారీ చేయనున్నారు. ఆదివారం సెలవు దినం కూడా టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌ను పెద్దఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల పరిశీలన కోసం ఒక బృందం కార్యాలయంలో ఉంటే, మరో బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లనుంది. ఈ కార్యక్రమంలో కమిషనర్ మౌర్య, డీటీసీపీ అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు, డీసీపీ మహాపాత్ర, ఏసిపి లు బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

- పెండింగ్ టీడీఆర్ బాండ్లు : 587
- రెండు రోజుల్లో వచ్చిన దరఖాస్తులు : 115
- శనివారం వచ్చినవి : 67
- టీపీఎస్ లాగిన్‌కి వెళ్లినవి : 48



కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

రెండు కార్లు, కత్తులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

8



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు



సంఘసంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్ నివాళులర్పించారు. బడుగు వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నేడు స్థానికుల దర్శన టోకెన్ల జారీ


తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి స్థానికుల కోటా దర్శనంలో భాగంగా ఆదివారం స్థానికులకు దర్శన టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. తిరుపతివాసులకు మహతి ఆడిటోరియంలో, తిరుమల స్థానికులకు బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 5 గంటల నుంచి జారీ చేస్తారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాల స్థానికులు ఆధార్ కార్డు ద్వారా పొందవచ్చు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుక

తిరుచానూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శనికవారం మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఈవో కేవీఎస్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.బడుగు, బలహీన వర్గాలకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనియాడారు. ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, ఉపాధ్యక్షుడు కుప్పిరెడ్డి, శిక్షణా కమిషనర్ వెంకటేశ్వర్లు, మునీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పాకాల:** తహశీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దార్ సంతోష్‌సాయి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు తహసీల్దారు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈవో కేవీఎస్ కుమార్ తదితరులు









కోదండరాముడికి ఎమ్మెల్యే నాని పట్టువస్త్రాల సమర్పణ



పాకాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా పెద్దగోర్పాడులో కోదండ రామస్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్యే పులివర్తి నాని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం. ఆలయానికి అనుబంధంగా నిర్మించిన కల్యాణ మండపానికి ప్రారంభోత్సవం చేశారు. డాక్టర్ మేడసాని మోహన్ ప్రవచించిన రామాయణ వైభవం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్థులు ఆయనను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆదివారం ఉదయం శ్రీరామచంద్రస్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవం, సాయంత్రం ఉత్సవ మూర్తి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ సూరినేని దామోదరం, వైస్ ఛైర్మెన్ డి.వేణునాయుడు, ప్రధాన కార్యదర్శి వి.కృష్ణమూర్తి, ఎస్.భాస్కర్ నాయుడు, ట్రెజరర్ ఎస్.ఆదికేశవులు నాయుడు, సభ్యులు డాక్టర్ ఎస్.మోహన్‌నాయుడు, ఎస్.నరసింహులు నాయుడు, డి.దీపక్, ఎస్.హరిప్రసాద్, జి.శశికుమార్, ఎస్.దేవరాజులు నాయుడు, వి.రవికుమార్ చౌదరి, బి.విశ్వనాథరావు , వి.జ్యోతిప్రకాష్ నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోదండరామయ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, మేదినిపూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, ప్రధాన అర్చకులు శ్రీనివాసభట్టర్, పరిచారికులు రామాచార్యులు, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ మునిహరిబాబు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు ఆదివారం ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారు, ధ్వజపటం, చక్రతాళ్వార్‌లకు తిరువీధి ఉత్సవం జరుగుతుంది. అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



దర్శించుకున్న హైకోర్టు జడ్జి

కోదండరామస్వామిని శనివారం రాత్రి ఏపీ హైకోర్ట్ జడ్జి చల్లా గుణరంజన్ దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేసారు. అంతకు ముందు ఆయన టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు మాజీ సంచాలకులు డాక్టర్ మేడసాని మోహన్ ఏర్పాటు చేసిన రామాయణ ప్రసంగమాలిక కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మద్యం బాబులకు పోలీసుల వార్నింగ్

రామచంద్రాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొత్తనెన్నూరు సమీపంలో నాంకాలువ వద్ద శనివారం మద్యం తాగుతున్న యువకులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మద్యం తాగుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని కొందరు మహిళలు ఎమ్మెల్యే నానికి ఇటీవల ఫిర్యాదు చేశారు. ఆయన సూచనలతో ట్రైనీ ఐపీఎస్ హేమంత్,ఎస్‌ఐ రవీంద్రనాయక్ సారథ్యంలో పోలీసులు శనివారం వచ్చి యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించారు. ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా కలశ ఆరాధన పూజ

భాకరాపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట కోదండ రావ ాా ల య ం లో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వస్తి వచనం, కలశ ఆరాధన, రక్షా బంధనం, మహాగణపతి పూజ, నవగ్రహ ఆరాధన, ప్రధాన దేవత హోమం, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ జరిగింది. ఆదివారం కల్యాణోత్సవం, గరుడ సేవ, గ్రామోత్సవం, హరినామ సంకీర్తన వంటి కార్యక్రమాలు జర ు గ ు తా య ని ఆలయ కమిటీ తెలిపింది.

అర్చకుడికి గాయాలు

తిరుమల, ఏప్రిల్5(ఆంధ్ర జ్యోతి): మొదటి ఘాట్‌రోడ్డులో కారు అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. శనివారం తిరుమల నుంచి ఓ అర్చకుడు ద్విచ క్ర వా హ నం లో తిరుపతికి బయలుదేరారు. వినాయక ఆలయానికి సమీపంలో వెనుక వైపు వచ్చిన కారు ఢీకొంది. అర్చకుడు కిందపడి స్వల్ప గాయపడ్డారు. వాహనం దెబ్బతింది.

అమ్మవారి సేవలో ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ



కుటుంబ సభ్యులతో శక్తికాంతదాస్

తిరుచానూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని శనివారం ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంతదాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం 'సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. జేసీ శుభం బన్సల్, తిరుపతి, కమిషనర్ మౌర్య, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ వారి వెంట ఉన్నారు.

భీమవరంలో చోరీ

చంద్రగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఓఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు ఈగ్రామానికి చెందిన సుమతి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతిలో ఉంటున్నాడు. స్వగ్రామానికి వారానికి ఓ రోజు వచ్చి వెళ్తుంటారు. శనివారం మధ్యాహ్నం వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి కనిపించాయి. బీరువాలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. 64 గ్రాముల బంగారు నగలు, కిలో వెండి,రూ.2లక్ష నగదు చోరీ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్‌ఐ అనిత చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్ద శనివారం రాత్రి ఎస్పీ, టీటీడీ సీవీఎస్వో హర్షవర్ధన్‌రాజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చి తిరుమలకు వచ్చే వాహనాలకు అలిపిరిలో ఇస్తున్న టోకెన్లను, టైమింగ్స్‌ను పరిశీలించారు. సెక్యూరిటీ స్కానింగ్ విధానాన్ని తనిఖీ చేశారు. తనిఖీ చేసే సమయంలో భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాల పనితీరు గురించి ఆరా తీశారు.

కారు ఢీకొని తీవ్ర గాయాలు

చంద్రగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు చిత్తూరుకు చెందిన దినేష్ శనివారం ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తుండగా పనపాకం వద్ద కారు ఢీకొంది. దినేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని రుయాకు తరలించారు

ముగిసిన మూట్‌కోర్ట్ పోటీలు

తిరుపతిరూరల్, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు మూడ్రోజులపాటు నిర్వహించిన మూట్‌కోర్ట్ పోటీలు శనివారంతో ముగిశాయి. 36జట్లు ప్రతిభ చాటాయి. చిట్టెల్ల సాయికృష్ణ కౌశిక్, డి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, కురుబ మనీష్, చంద్రశేఖర్‌తో కూడిన బృందం విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ఫ్యామిలీకోర్ట్-కమ్-ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి .రాంగోపాల్, కళాశాల ఛైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బైరాగిపట్టెడలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ మౌర్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమశాఖ ఈడీ విక్రమ్‌రెడ్డి, మాజీ మంత్రి పరసారత్నం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, వలముని, ఆర్సీ మునికృష్ణ, ఎస్కే బాబు, పులుగోరు మురళీ, రాజారెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి (వైద్యం): బడుగు బలహీనుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసి వారి హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని రుయా సూపరింటెండెంట్ రవిప్రభ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శనివారం రుయాస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ఈఎస్ఐ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంబాబు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్‌కు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, రుయా అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఆర్ఎంవో శ్రీనివాస్, ఏవో రమేష్, ఉద్యోగ సంఘ నేతలు రాజా, వరప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతి(టీటీడీ): డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి టీటీడీ ఉద్యోగులు నివాళులు అర్పించారు. **తిరుపతి(నేరవిభాగం):** ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన రాజు బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **తిరుపతి(ఆటోనగర్):** సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు తమ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. **తిరుపతి(వైద్యం):** స్థానిక కేశవాయనగుంటలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. **తిరుపతి:** నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ ఇతర కార్పొరేటర్లు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా తుడా కార్యాలయంలోనే వీసీ మౌర్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. **తిరుపతి (విశ్వ విద్యాలయాలు):** ఎస్వీయూలో వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీలో వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని, వేద వర్సిటీలో రిజిస్ట్రార్ భాస్కరుడు, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు విభాగాధిపతి భీమన్నలు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు అర్పించారు.

అంగన్వాడీ కమీషన్లు ఇప్పించాలని మంత్రికి వినతి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీచేసే సరుకుల కమీషన్ 2013నుంచి ఆగిపోయిందని, దానిని వెంటనే ఇప్పించాలని అర్బన్ రేషన్ డీలర్స్ అధ్యక్షులు చంద్రశేఖర్ బృందం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల సమక్షంలో మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. శుక్రవారం తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గిరిబాబు, డీఎస్‌వో శేషాచలంరాజు, ఏఎస్‌వో సురేంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని ఒకరి మృతి

తిరుపతి నేరవిభాగం ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పెద్దపంజాణి మండలం ఆకులవారిపల్లె గ్రామానికి చెందిన ఆర్.ప్రభాకర్‌రెడ్డి తనపల్లి క్రాస్ సమీపంలోని హరివిల్లు డాబా వద్ద రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని అన్నకుమారుడు రాజేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు.

తిరుపతి

హోంస్టే నిర్వాహకుల మధ్య ఘర్షణ

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఇరువర్గాలపై కేసులు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రెండు హోంస్టేల నిర్వాహకుల నడుమ ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. చింతలచేనులో డెక్కన్ సూట్స్ పేరుతో స్టే హోం నిర్వహిస్తున్న కలికిరి నవీన్‌కుమార్ రెడ్డి, అతని స్నేహితులు నరేష్‌కుమార్, హోటల్ మేనేజర్ లక్ష్మీనారాయణలు ఆరుబయట నిలుచుని ఉన్నారు. డెక్కన్ సూట్స్‌కు ఎదురుగా గరుడ ఇన్ హోం స్టే ఉంది. దీన్ని నిర్వాహకుడైన పవన్‌కుమార్ తన స్నేహితులు మధుశేఖర్, మరికొంతమంది తమ స్టే హోంకు వచ్చే వారిని ఎందుకు తీసుకెళుతున్నారని డెక్కన్ సూట్స్ వారితో గొడవకు దిగారు. ఈ క్రమంలో కత్తులు, రాడ్లు, కర్రలు తీసుకుని దాడులు చేశారు. నవీన్‌కుమార్‌రెడ్డి, నరేష్ కుమార్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. లక్ష్మీనారాయణ గాయపడ్డాడు. సీఐ రామకృష్ణ, ఎస్ఐలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నవీన్‌కుమార్, నరేష్‌కుమార్‌లను తిరుపతి రుయాకు తరలించారు. పవన్‌కుమార్, మధుశేఖర్‌తో పాటు మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. అదేవిధంగా గరుడ ఇన్ స్టే హోం యజమాని పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్, పణీంద్ర నరేష్‌లపై కేసు నమోదు చేశారు.

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

- 8 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు అటవీ రేంజ్‌లో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ఇద్దరు ఎర్రచనందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందం, పత్తూరు అటవీ శాఖ ఎఫ్‌బీవో లింగనాయక్‌తో కలిసి అక్కడ తెలుగు గంగ కెనాల్ నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేస్తూ ముందుకు సాగారు. ఖాజీపేట మండలం ప్రొద్దుటూరు రేంజ్‌లో ఇద్దరు వ్యక్తులు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని వెంటాడి పట్టుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు డంప్ చేసిన 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగర్లు కడప జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనాన్ని, రెండు ద్విచక్ర వాహనాలను తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాదర్బార్‌కు 35 వినతులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 35వినతులు వచ్చాయి. ఇందులో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 17వినతులు, రెవెన్యూ 3, టీటీడీ, దేవదాయశాఖ, పోలీసు, నీరుపారుదల, విద్యుత్, ఏపీఎంఎస్‌డీసీ, సహకారశాఖలకు సంబంధించి 18 వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. వాటిని ఆయా శాఖలకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు.

కళాశాలల్లో కోర్సుల తొలగింపు తగదు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో జూనియర్ కళాశాలల్లో కొన్ని కోర్సులను తొలగించడం తగదని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఇంటర్ విద్యలో 455 ఉద్యోగాలను నాన్ శాంక్షన్ కళాశాలలకు సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఖండించారు.

వైసీపీ నాటకాలను ప్రజలు నమ్మరు



మాట్లాడుతున్న నరసింహయాదవ్, ఆర్సీ.మునికృష్ణ, శ్రీధర్‌వర్మ

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీ నాయకుల నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహయాదవ్ మాట్లాడుతూ టీడీఆర్ బాండ్లపై బాధితులు తమ సమస్యలు చెప్పుకుంటుంటే దానికి కారణమైన వ్యక్తులు నాటకాలు ఆడడం తగదన్నారు. టీటీడీ మాజీ చైర్మన్ సివిల్ వర్క్స్ పేరుతో రూ.1600 కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. టీడీఆర్ బాండ్లపై విచారణ జరుగుతుందన్నారు. డబుల్ డెక్కర్ పేరుతో తిరుపతి పచ్చదనాన్ని నాశనం చేశారన్నారు. వేసి రోడ్లు నాణ్యత లేకుండా వేశారని, తుడా నిధులు రూ.320 కోట్లు వృధా చేశారని ఆరోపించారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ దర్శన టికెట్లు అమ్ముకోవడం, దేవుడి సొమ్మును, ప్రజల సొమ్మును లూటీ చేయడంపై నాటకాలు ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, జగన్నాథం, సుబ్రహ్మణ్యం, జయరాం, జగ్గ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై బండ వేసిందని తిరుపతి టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువలు, ప్రభుత్వ స్థలాలు, యజమానుల అనుమతి లేకుండా రోడ్లు వేసి టీడీఆర్ బాండ్ల రూపంలో రూ.200 కోట్లు దోచేశారని ఆరోపించారు. మీ నాటకాలు ప్రజలు మరవకుండా 63వేల ఓట్లతో ఓడించి ఇంటికి పంపారని పేర్కొన్నారు. మునిశేఖర్ రాయల్, బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరామయ్య, రామమూర్తి, ఆముదాల తులసీరామ్, ఆనంద్ యాదవ్, శ్రీనివాసులు, అశోక్, యువరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యుత్ చార్జీలు పెరగలేదు : ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత విద్యుత్ చార్జీలు పెరగలేదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు విద్యుత్‌చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఆ ప్రకారం ప్రభుత్వం ఏర్పడి ఇప్పటి వరకు చార్జీలు పెరగలేదన్నారు. అయితే వైసీపీ నాయకుడు అభినయ్ విద్యుత్ చార్జీలు పెంచారని నాటకాలు ప్రదర్శించడం తగదన్నారు. మొన్నటి ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పినా అభియన్ తీరు మారలేదన్నారు. టీడీఆర్ బాండ్ల స్కాంలో ఉన్న ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తే లేదన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లతో భూమి కోల్పోయిన అర్హులందరికీ టీడీఆర్ బాండ్స్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, మహేషయాదవ్, రాజేష్‌యాదవ్, ఆకేపాటి సుభాషిణి పాల్గొన్నారు.

నిరుపేద యాదవులను ఆదుకోండి



నరసింహయాదవ్‌ను సన్మానిస్తున్న యాదవులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నిరుపేద యాదవులను ఆదుకోవాలని రెస్పాన్సిబుల్‌యాదవ్ జాయింట్ యాక్షన్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలముంతల సుబ్బుయాదవ్ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్‌ను కోరారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నరసింహయాదవ్‌ను మంగళం ఉమ్మడి పంచాయితీకి చెందిన పలువురు యాదవులు, బీసీ సంఘాల నాయకులు శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌యాదవ్, గోపి, సుబ్రహ్మణ్యంఆచారి, రామమూర్తి, కేశవ, సుబ్బమ్మ, పుష్పమ్మ, మధు, తిరుపతియాదవ్ పాల్గొన్నారు.

వరాహస్వామి సేవలో హోంమంత్రి అనిత



తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): హోం మంత్రి అనిత శనివారం వరాహ స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె నేరుగా ఆలయం వద్దకు చేరుకోగా, టీటీడీ రిసెప్షన్ అధికారులు భాస్కర్, సత్రేనాయక్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్వాగతం పలికారు. రాత్రికి మంత్రి తిరుమలలోనే బస చేసి ఆదివారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఘనంగా పాటూరి జయంతి వేడుకలు



రాజగోపాల నాయుడికి నివాళులు

తవణంపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ పాటూరి రాజగోపాల నాయుడు 105వ జయంతి వేడుకలను తవణంపల్లె మండలంలోని దిగువమాఘం రాజన్న పార్కులో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, గల్లా దంపతులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే గల్లా అరుణకుమారి మనవడు, సినీ హీరో అశోక్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి.. వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. రాజగోపాల్ నాయుడు జీవితం ఎందరికో ఆదర్శమని, విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, స్థానిక సర్పంచ్ గోపితోపాటు పలువురు టీడీపీ నాయకులు, దిగువమాఘం గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ వలలో చిక్కిన యోగా శిక్షకురాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సైబర్ వలలో చిక్కి ఒక యోగా శిక్షకురాలు రూ.85వేలు పోగొట్టుకుంది. సీఐ రామయ్య కథనం మేరకు...రాయల్‌నగర్‌లో కాపురమున్న యోగా శిక్షకురాలు తేజోవతికి చెందిన బ్యాంకు అకౌంటు నుంచి శనివారం రూ.6 వేలు కట్ అయింది. దీనికి సంబంధించి మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. అలాగే నకిలీ బ్యాంకు టోల్ ఫ్రీ నంబర్ వచ్చింది. ఆమె తన బ్యాంకు నుంచే మెసేజ్ వచ్చిందని భావించి ఫోన్ చేసింది. కేటుగాళ్లు ఆమెకు ఓ లింక్ పంపారు. ఆ లింక్‌లోని సూచనల మేరకు పూర్తివివరాలు నమోదు చేసింది. అంతే రూ.30వేలు ఒకసారి, రూ.49వేలు స్వాహా చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్వీయూ సీఐ రామయ్య కేసు నమోదు చేశారు.

తాతయ్యగుంట గంగమ్మకు రూ.లక్ష విరాళం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి శనివారం రూ.లక్ష విరాళం అందింది. తిరుపతికి చెందిన శ్రీసాయిరాం టిఫెన్ సెంటర్ కె.నీలకంఠరెడ్డి, కుటుంబ సభ్యులు కలిపి రూ.1,11,116 విరాళాన్ని ఆలయ ఈవో జయకుమార్‌కు అందజేశారు.



సీజేఐ దంపతులకు ప్రసాదాలు అందిస్తున్న ఈవో శ్యామలరావు

అమ్మవారి సేవలో సీజేఐ

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా శనివారం రాత్రి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు ఆలయ మర్యాదలతో జస్టిస్‌కు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలవర్లను దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు పలువురు న్యాయమూర్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సీజే రాక సందర్భంగా ఆలయం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

'కల్కి2'కి ఇంకా టైం ఉంది
నాగ్ అశ్విన్

రెబల్ స్టార్ ప్రభాస్ 'కల్కి-2'పై దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. తిరుమల శ్రీవారిని శనివారం సుప్రభాతసేవలో దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కల్కి సెకండ్ పార్టు ఎప్పుడు రాబోతోందని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఇంకా టైం పడుతుందన్నారు. కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోడం సంతోషంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,327

తలనీలాలు సమర్పించినవారు: 26,354



సప్తగిరుల్లోనూ మార్మోగే శ్రీరామనామం

అన్ని అర్చనలు, సేవల్లోనూ ఆయనకు స్థానం

నేడు శ్రీరామనవమి ఆస్థానానికి ఘనంగా ఏర్పాట్లు



కౌసల్యా సుప్రజా రామా...

యుగపురుషుడు శ్రీరామచంద్రమూర్తి త్రేతాయుగానికే పరిమితం కాదు. కాలమేదైనా ధర్మానికీ, జనరంజక పాలనకూ ఆయనే ఆదర్శం. కలియుగ వెంకన్న కొలువైన తిరుమలలోనూ ఈ జగదభిరాముడి ప్రస్తావన వినిపిస్తూనే ఉంటుంది. కనిపిస్తూనే ఉంటుంది. శ్రీవారిని మేలుకొలుపే 'కౌసల్యా సుప్రజారామా, పూర్వా సంధ్యా ప్రవర్తతే...' అంటూ ఈ జగదానందకారకుడి నామ స్మరణతోనే లోకాన్ని మేల్కొలుపుతారు. తిరుమల క్షేత్రంలో కొలువుదీరి ఉన్న శ్రీరాముడి విగ్రహం వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగింది. తిరుమల శ్రీనివాసుడితో పాటు పూజలందుకుంటోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అదిగదిగో రాములవారి మేడ

తిరుమల బంగారువాకిలి నుంచి వేంకటేశ్వరుడి గర్భాలయంలోకి వెళ్లే మార్గంలో స్నపనమండపం దాటగానే 'రాములవారిమేడ' దర్శనమిస్తుంది. అక్కడ రాములవారి పరివారమైన అంగద, హనుమంత, సుగ్రీవుల విగ్రహాలుంటాయి. ప్రస్తుతం గర్భాలయంలో శ్రీనివాసుడి మూలమూర్తితో పాటు సీతారామలక్ష్మణుల విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. ఈ విగ్రహాలు పూర్వం రాములవారిమేడలో ఉండేవని చెబుతారు. అందువల్లే రాములవారి మేడగా పిలుచుకుంటున్నారు.

తెప్పోత్సవాల్లో తొలిరోజు విహారం

ఏటా ఐదు రోజుల పాటు జరిగే వార్షిక తెప్పోత్సవాల్లో తొలిరోజు తెప్పపై కొలువుదీరేది శ్రీరామచంద్రుడే. పుష్కరిణిలో తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా నీలమేఘశ్యాముడు దివ్యతేజస్సుతో విహరిస్తూ భక్తకోటికి దర్శనమిస్తారు. వసంతోత్సవాల్లో తొలి రెండు రోజులు మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించే అర్చకులు చివరిరోజు కృష్ణస్వామిని, రాములవారిని ఒకే వేదికపై కొలువుదీర్చుతారు. వారికీ స్నపనం నిర్వహిస్తారు. ఒకే వేదికపై కనిపించే ఈ ఇద్దరు యుగపురుషులను చూడటానికి భక్తులు ఎంతో ఆసక్తి కనబరుస్తారు.


బ్రహ్మోత్సవాల్లో కోదండరాముడిగా దర్శనం

ఏటా బ్రహ్మోత్సవాల్లోనూ ఆరో రోజు హనుమంత వాహనంపై శ్రీవారే కోదండరాముడిగా మాడవీధుల్లో విహరించి దర్శనమిస్తారు. త్రేతాయుగంలో తనకు సేవ చేసిన భక్త శిఖామణి హనుమంతుడిని వాహనంగా చేసుకుని తిరువీధుల్లో ఊరేగుతారని చెబుతారు. హనుమంతుడి భక్తి తత్పరతను ఈకాలం నాటి వారికి చాటిచెబుతూ రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు అన్నీ తానేనని తెలియజేస్తారు. రథసప్తమి నాడూ హనుమంత వాహనంపై దర్శనమిస్తారు.

జన్మ నక్షత్రం నాడు ఊరేగింపు

ఆయా మాసాల్లో వచ్చే ప్రత్యేక నక్షత్రాలకు తగినట్టు మలయప్పస్వామి దర్శనమిస్తుంటారు. శ్రీరాముడు జన్మనక్షత్రమైన పునర్వసు రోజున శ్రీవారి ఆలయంలో ఆస్థానం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సీతారామలక్ష్మణస్వామిని పీఠంలో అధిరోహింపజేసి విశేష అభరణలు, పూలమాలలతో అలంకరించి సహస్ర దీపాలంకార సేవను నిర్వహిస్తారు. శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయస్వామి సమేతంగా తిరుమాడవీధుల్లో ఊరేగుతారు.

తిరుమల వీధుల్లో ఊరేగుతున్న శ్రీరామచంద్రమూర్తి (ఫైల్‌ఫొటో)



ప్రియ సేవకుడు కొలువుదీరిందిక్కడే

రాముడి విశ్వాసపాత్రుడైన సేవకుడు ఆంజనేయస్వామి కొలువైంది కూడా ఏడుకొండల్లోని అంజనాద్రే. తల్లి అంజనాదేవితో కలిసి బాలాంజనేయస్వామి నేటికీ ఆకాశగంగ తీర్థం వద్ద భక్తులకు దర్శనమిస్తున్నారు. అంజనాద్రే ఆంజనేయుడి జన్మస్థలమని ఇటీవల కొన్ని పండిత బృందాలు కూడా శాస్త్రపరంగా నిరూపించాయి. విశిష్టత కలిగిన జపాలి క్షేత్రం కూడా అంజనాద్రిపైనే వెలసింది. జపాలి మహర్షి కోరిక మేరకు అంజనేయస్వామికి స్వయంభువుగా వెలసినట్టుగా చారిత్రక ఆధారాలున్నాయి. స్కందపురాణం, వేంకటాచల మహత్యంలోనూ ఈ క్షేత్రం గురించి ప్రస్తావించారు. రావణ సంహారం తర్వాత సీతా సమేతంగా ఆయోధ్యకు వెళ్లే ముందు శ్రీరాముడు జపాలి తీర్థంలో కొంతకాలం విడిది చేసినట్టు మరో ఐతిహ్యం ప్రాచుర్యంలో ఉంది.

నేడు శ్రీరామనవమి ఆస్థానం

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయక మండపంలో సీతాలక్ష్మణ సమేత హనుమంతుల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. వేదమంత్రోచ్చరణల నడుమ అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంతవాహన సేవ జరుగనుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య బంగారువాలికిలో శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. మరుసటి రోజు రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవంగా చేపట్టనున్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

రెండు కార్లు, కత్తులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి జీవకోనలో కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో ఇద్దరు నిందితులను శనివారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ శ్రీలత మీడియాకు తెలిపిన వివరాలివి.... తిరుపతి జీవకోనలో ఉంటున్న కసారం రాజేష్ మీ-సేవ నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ భార్గవ్ ఇతనికి స్నేహితుడు. రాజేష్‌కు అతని తల్లి విజయ పేరుతో విలువైన పొలాలు, ఆస్తులున్నాయని భార్గవ్ తెలుసుకున్నాడు. దీంతో రాజేష్‌ను, కుటుంబసభ్యులను బెదిరించి రూ.2 కోట్లు లాక్కోవాలని పథకం పన్నాడు. బీ-టెక్ చదివి అప్పటికే నేరాలతో సంబంధమున్న వట్టికుంట అరుణ్‌కుమార్‌తో చేతులు కలిపాడు. పన్నాగంలో భాగంగా గతనెల 28న రాజేష్‌కు ఫోన్ చేశారు. బీమా పాలసీ చేయించడానికి తల్లిని తీసుకురావాలని నమ్మపలికారు. దీంతో రాజేష్ తన తల్లిని తీసుకుని భార్గవ్ ఉంటున్న ఫ్లాట్‌కు వచ్చాడు. అరుణ్, భార్గవ్‌లు వెంటనే వారిద్దరినీ గదిలో బంధించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఉన్న రూ1.5 కోట్లు డ్రా చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు స్పందించకపోవడంతో రాజేష్ భార్య సుమతి, ఇద్దరు చిన్న పిల్లలను కూడా తీసుకొచ్చారు. అయినా చలించకపోవడంతో మరుసటి రోజు (29న) తెల్లవారుజామున సుమతి, ఆమె అత్తను, ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి కారులో బెంగళూరుకు వెళ్లారు. మరో వాహనంలో రాజేష్‌ను కిడ్నాప్ చేసి చిత్తూరు వైపు బయలుదేరారు. అయితే ఐతేపల్లి వద్ద రాజేష్ చాకచక్యంగా వాహనం బ్రేక్ వేసి డోర్ తీసి కారు నుంచి బయట పడ్డాడు. దీంతో అరుణ్‌కుమార్ ఆగ్రహంతో రాడ్‌తో రాజేష్‌పై దాడి చేసి అదే వాహనంలో వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన రాజేష్ వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు జరిగిన విషయం తెలియజేశాడు. స్థానికులు అతడ్ని తిరుపతి రుయాలో చేర్పించాడు. తమ ప్లాన్ బెడిసికొట్టిందని తెలుసుకున్న నిందితులు రాజేష్ తల్లి విజయను చిత్తూరులో వదలిపెట్లారు. సుమతిని బెంగళూరులోని ఆమె పుట్టింటి సమీపాన విడిచివెళ్లారు. పిల్లలను కూడా వదిలేశారు. అలిపిరి పోలీసులు కిడ్నాప్ కేసును సీరియస్‌గా పరిగణించారు. గాలింపు ముమ్మరం చేశారు. రేణిగుంట-కడప రోడ్డులో కుక్కల దొడ్డి వద్ద ప్రధాన నిందితులు అరుణ్‌కుమార్, భార్గవ్‌లతో పాటు పలు కేసులతో సంబంధమున్న సాయికుమార్, మణికంఠ, ప్రకాష్, గణేష్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు, నాలుగు కత్తులు, మత్తు పదార్థాలు, ఐరన్ రాడ్‌తో పాటు వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ రాంకిషోర్, ఎస్‌ఐలు లోకేష్‌బాబు, నాగార్జున రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

నిందితులు పాతనేరస్థులే..

కిడ్నాప్ యత్నం కేసులో నిందితుడు అరుణ్‌కుమార్‌ది గరుడాద్రినగర్. ఇతనే ఈ వ్యవహారమంతా నడిపించాడని పోలీసులు గుర్తించారు. 2015లో స్నేహితుడు దిలీప్‌ను మోసం చేసి హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు. ఇతడిపై నాలుగు క్రిమినల్ కేసులు, ఏటీఎం చోరీ కేసు, కిడ్నాప్ కేసులు, ఇతర ఆర్థిక మోసాల కేసులున్నాయి. రౌడీ షీట్ కూడా ఉంది. మరో నిందితుడు భార్గవ్‌పై హత్య కేసుతో పాటు కిడ్నాప్, బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఇతనిపై తిరుపతి పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు.

జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుల ఎంపిక కమిటీలో పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్



కలికిరి/కడప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఏర్పాటు కానున్న జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులను ఎంపిక చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటితో పాటు రాష్ట్రంలోని మిగతా 13 కొత్త జిల్లా కేంద్రాల్లో జువెనైల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బోర్డులో చైర్మన్, సభ్యుల పదవుల కోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవాలని కోరుతూ ప్రభుతవం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ బోర్డుకు అర్హులైన చైర్మన్, సభ్యులను ఎంపిక చేయడానికి తాజాగా ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావును నియమించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆ శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు. సభ్యులుగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.లలితకుమారి, కడప యోగివేమన వర్శిటీ సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత, ఏపీ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతితో పాటు ఒక యునిసెఫ్ ప్రతినిధి, సౌత్ రీజినల్ రిసోర్స్ సెంటర్ ఫర్ చిల్డ్రన్ ఇండియా ఫౌండేషన్ నుంచి మరో ప్రతినిధినితో ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటయింది. మూడేళ్లపాటు ఈ కమిటీ కార్యకలాపాల్లో పాల్గొంటుందని పేర్కొంటూ రాష్ట్ర స్త్రీ, బాలల, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షకు 1,888 మంది హాజరు



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుతిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నేషనల్ టెస్ట్ ఏజన్సీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు జిల్లాలో 1,888 మంది హాజరయ్యారు. తిరుపతిలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, గీతం, శ్లోక ఎ బిర్లా, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం పరీక్ష సమయానికి అర్ధగంట ముందే 1.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మధ్యాహ్నం 12 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 2,125 మంది దరఖాస్తు చేసుకోగా 237 మంది గైర్హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి. కైలాస్‌నాథ్ చెప్పారు.

సైన్స్ సెంటర్‌లో సమ్మర్ హాబీ క్యాంప్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

మంగళం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్‌సెంటర్‌లో విద్యార్థుల కోసం సమ్మర్ హాబీ క్యాంప్‌ను ఈ నెల 28 నుంచి మే 31 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో 4 నుంచి పదో తరగతి వరకు చదువు తున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. సబ్జెక్టును బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 7989694681ను సంప్రదించాలని కోరారు.

నేడు తిరుపతి-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్) ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): తిరుపతి-పుదుచ్చేరిల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(16111) ఆదివారం రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు నిర్వహించే మార్గంలో పనులు సరుగుతున్న కారణంగా ఒక రోజు రద్దు చేశామన్నారు.

రేణిగుంట అర్బన్ సీఐకి చార్జి మెమో

● ఎస్ఐ అరుణ్‌కుమార్‌పై విచారణకు ఎస్పీ ఆదేశం

రేణిగుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పారిపోయిన ఘటనలో అర్బన్ సీఐ శరత్‌చంద్రకు ఎస్పీ చార్జి మెమో జారీ చేశారు.అలాగే అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్‌రెడ్డిపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి.రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటనపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు సీరియస్ కావడంతో ఇద్దరు ఐడీ పార్టీ కానిస్టేబుళ్లపై ఇదివరకు సస్పెన్షన్ వేటు పడగా ఇదే ఘటనపై స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బాధ్యత వహిస్తూ సీఐకు చార్జి మెమో జారీ చేశారు.ఈ ఘటనపై పలు అవినీతి ఆరోపణలు రావడం తో ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డిపై ఎస్పీ పోలీసులు విచారణ చేసి ఎస్పీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

అందరూ ఇచ్చినా ఆయనొక్కడే!

శ్మశాన దారికి భూమిచ్చేందుకు ససేమిరా అన్నరైతు



కొలతలు తీసి రాళ్లు నాటుతున్న అధికారులు

పుత్తూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి):పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపురానికి శ్మశాన దారి సమస్య చాలా రోజులుగా ఉంది. గ్రామానికి, శ్మశానానికి మధ్య దాదాపు రెండు కిలోమీటర్లుండడంతో శవాలను పొలాల మీద తీసుకువెళ్లాల్సి వస్తోంది. పొలాలన్నీ పట్టా భూములే కావడంతో 35 మంది పట్టాదారుల అంగీకారంతో దారి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉచితంగా పట్టా భూములు ఇచ్చేందుకు 34 మంది రైతులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఓ రైతు మాత్రం భూమిని ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి ఈ సమస్య వెళ్లింది. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ సురేంద్రనాయుడు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, వామపక్ష నాయకులు వెంకటేశం, గ్రామస్తులు కలిసి ఆ రైతును ఒప్పించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ రైతు కోల్పోయే ఒకటిన్నర సెంటు భూమికి గ్రామంలో సేకరించిన రూ.మూడు లక్షలను పరిహారంగా ఇస్తామని నచ్చజెప్పారు.అయినా ఆయన స్పందించకపోవడంతో షణ్ముగరెడ్డి చొరవ తీసుకుని పుత్తూరు పట్టణంలో మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇప్పిస్తామని చెప్పారు. అయినా సమ్మతించని ఆ రైతు ఓ దశలో అసహనానికి గురై తనపై ఒత్తిడి తెస్తే చీటీ రాసి చచ్చిపోతానని స్పష్టం చేశారు. దీంతో ఏమి మాట్లాడాలో అర్థంగాని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పటికే అంగీకరించిన 34 మంది రైతుల పట్టా భూముల్లో కొలతలు వేసి రాళ్లు నాటి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. పది రోజుల తర్వాత మరోసారి రైతుకు కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని భావిస్తున్నారు.

క్రీడాకారుల సొమ్ము రూ.119కోట్లు మింగేశారు

● మాజీ మంత్రి రోజాపై శాప్ ఛైర్మన్ ఆరోపణ

● టీడీఆర్ బాండ్లపై నాటకం వేయాలని వైసీపీకి సూచన



రవినాయుడు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వీధి నాటకాలు వేసే వైసీపీ నాయకులు టీడీఆర్ బాండ్లపై మున్సిపల్ ఆఫీస్‌లో జరుగుతున్న గ్రీవెన్స్ వద్దకు వచ్చి నాటకం వేయాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు సవాల్ విసిరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అరెస్టు చేసే దమ్ము, ధైర్యం ఉందా అని మాజీ మంత్రి రోజా మాట్లాడుతున్నారని, అరెస్టు చేసేందుకు వాళ్లు చేసిన అవినీతి పనులే చాలన్నారు.మంత్రిగా ఉన్న సమయంలో క్రీడాకారులకు చెందాల్సిన సుమారు రూ.119 కోట్ల డబ్బును దోచుకు తిన్నారని విమర్శించారు. రోజా అరెస్టు న్యాయబద్ధంగానే త్వరలో జరుగుతుందని, అంతవరకూ ఓపిక పట్టాలన్నారు. నోరుంది కదా అని ఇష్టానుసారం మాట్లాడితే ఎవరూ భయపడబోరన్నారు. చెన్నైలో వుంటోన్న రోజా తమిళనాడు ఛానల్స్ చూస్తారని, బెంగళూరులో వుంటోన్న వారి నాయకుడు కన్నడ ఛానల్స్ చూస్తారని ఏపీలో ఛానల్స్‌ను చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి తెలుస్తుందన్నారు. ఐదేళ్లలో వెయ్యి రూపాయలు పింఛను సొమ్ము పెంచిన వైసీపీ నేతలు కూడా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. తిరుపతిలో ఎన్నడు లేని విధంగా పగటి వేషాలు వేస్తున్న వైసీపీ నేతలు ముందు దాని గురించి పూర్తిగా తెలుసుకుంటే మంచిదన్నారు. అసెంబ్లీ సాక్షిగా వైసీపీ ఎమ్మెల్సీలు అడిగిన విద్యుత్ ఛార్జీల పెంపు ప్రశ్నకు సంబంధిత మంత్రి వివరంగా సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు, కూటమి ప్రభుత్వం 9 నెలల పాలనలో ఎప్పుడు పెంచారో అభినయ్ సమాధానం చెప్పాలన్నారు. తాము రాజకీయ విలువలతో ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తున్నాం కాబట్టి మీరు మాస్కులు పెట్టుకుని వీధి నాటకాలు వేయగలుగుతున్నారన్నారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు టీటీడీ నిధులు విడుదల చేయడంపై మాట్లాడుతున్న వైసీపీ నాయకులు దానికి, టీటీడీకి ఎలాంటి సంబంధం ఉంది అనే విషయాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

ఇబ్బందులు తొలగి అభివృద్ధివైపు అడుగులు..

● ఎమ్మెల్సీ సోము వీర్రాజు

తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దయతో రాష్ట్రంలోని ఇబ్బందులన్నీ తొలిగి అభివృద్ధివైపు అడుగులేస్తున్నామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 2014 నుచి 2024 వరకు అనేక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం రాష్ట్రం రాజధాని, స్టీల్ ప్లాంట్, పోలవరం వంటి అనేక అంశాల్లో ప్రగతిని సాధిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ వయస్సులోనూ నిరంతరం పర్యటన చేస్తున్నారని, వారితో పాటు డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కూడా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడేలా ఆశీర్వదించమని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. ఇక, శ్రీవారి నిధులను ధర్మానికే కేటాయించాలన్నారు. ఈ సంకల్పంతో భానుప్రకాష్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రసంశించారు.



నవమి వేడుకలకు కోదండరామాలయం ముస్తాబు



కోదండరామాంజనేయస్వామి ఆలయం

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటిమిట్టలో ఉన్న కోదండ రామాంజనేయస్వామి ఆలయాన్ని శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 8న శేషవాహనం, 9న హంసవాహనం, 10న సంహవాహనం, 11న హనుమంతసేవ, 12న గరుడసేవ, 13న కళ్యాణోత్సవం, 14న రథోత్సవం, 15న అశ్వవాహనం, 16న వసంతోత్సవం, 17వ తేదీన ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

మండలాభివృద్ధికి సహకరించండి



సీఎం చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న కృష్ణయ్య

పెళ్లకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలాభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి టీడీపీ మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసిన కృష్ణయ్య మండలంలో సమస్యలను వివరించారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పెళ్లకూరు మండలం అభివృద్ధిలో అట్టడుగున ఉందని వాపోయారు. నియోజకవర్గంలోని అన్ని మండ లాల్లో గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ తదితర విద్యా సంస్థలు ఉన్నాయని, పెళ్లకూరు మండలంలో మాత్రం అలాంటి ప్రత్యేక విద్యాసంస్థలు లేవన్నారు. గతంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతి పాదించినా, ఆచరణకు నోచుకోలేదన్నారు. స్పందించిన సీఎం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కృష్ణయ్యకు సూచించారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 5: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని పట్టణంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెండో పట్టణ పరిధిలోని తిలక్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి కోనేటిమిట్టలోని కోదండరామాంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మురళీరెడ్డి, కోట సునీల్ కుమార్, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, పేటేటి చంద్రనీల్, మనోజ్ కుమార్, మల్లికార్జున్, శ్యామ్, దయాకర్, శ్రీహరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.జ

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు అటవీ రేంజ్‌లో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ఇద్దరు ఎర్రచనందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి 8 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందం, పత్తూరు అటవీశాఖ ఎఫ్‌బీవో లింగనాయక్‌తో కలిసి అక్కడ తెలుగు గంగ కెనాల్ నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేస్తూ ముందుకు సాగారు. ఖాజీపేట మండలం ప్రొద్దుటూరు రేంజ్‌లో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిళ్లపై అనుమానాస్పదంగా నిలబడి ఉన్నారు. వారు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి మోటారు సైకిళ్లను వదలి పారిపోయేందుకు యత్నించారు. టాస్క్‌ఫోర్సు సిబ్బంది వారిని వెంటాడి పట్టుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు డంప్ చేసిన 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగర్లు కడప జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనాన్ని, రెండు ద్విచక్ర వాహనాలను తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ

తిరుచానూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని శనివారం ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంత దాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ముందుగా వారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. జేసీ శుభం బన్సల్, తిరుపతి, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ పాల్గొన్నారు.



ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో శక్తికాంత దాస్

ఆటోను ఢీకొన్న బస్సు: ఒకరి మృతి

తడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆటోను బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. అండగుండాల గ్రామానికి చెందిన చిన్నయ్య (42) బంధువు కుమార్‌తో కలిసి శుక్రవారం రాత్రి ఆటోలో అక్కంపేటకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా చేనిగుంట జాతీయ రహదారి మలుపు వద్ద చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నయ్య, కుమార్ గాయపడ్డారు. వారిని తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం చిన్నయ్య మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో







యడవూడి, దిగువ కలవకూరు, ఎగువ కలవకూరు వద్ద అధ్వానంగా ఉన్న వంతెనలు

శిథిల వంతెనలు.. ప్రమాద నిలయాలు

వాహనదారుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

పెళ్లకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అయిదు మండలాల ప్రజల సౌకర్యార్థం పెళ్లకూరు మండలంలోని కోనేటిరాజుపాలెం నుంచి పాలచ్చూరు, పెరుమాళ్లపల్లి, అనకవోలు, కలవకూరు, ముమ్మారెడ్డిగెంట గ్రామాల మీదుగా కొణతనేరి వరకు సుమారు 20 కిలో మీటర్ల రహదారిని నిర్మించారు. ఈ మార్గంలో యడవూడి, దిగువ కలవకూరు, ఎగువ కలవకూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాల సమీపంలోని పంటకాలువలపై 1967లో వంతెనలు నిర్మించారు. ఈ మార్గంలో పెళ్లకూరు, తొట్టంబేడు, బాలయపల్లి, నాయుడుపేట, ఓజిలి మండలాల ప్రజలతో పాటు మేనకూరు సెజ్‌కు వెళ్లే కార్మికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాలువలపై వంతెనలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ముఖ్యంగా యడవూడి, కలవకూరు సమీపాన ఉన్న వంతెనలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇటీవల ముమ్మారెడ్డిగుంట వద్ద వంతెన కుంగిపోయి గొయ్యిలు ఏర్పడ్డాయి. వాహనదారులు గొయ్యిలో ఇరుక్కుని ప్రమాదాలకు గురయ్యారు. ఇటీవల వరి ధాన్యం బస్తాలతో వెళుతున్న ట్రాక్టర్ వంతెనపై కుంగిపోయి బస్తాలు కాలువలో పడ్డాయి. శిథిలమైన వంతెనల స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.







గూడూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా - సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ - వెంకటగిరిలో జగ్జీవన్‌రామ్ జయంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశాభి వృద్ధికి ఎంతో కృషిచేసిన మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ లాంటి మహనీయులను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ కేంద్రం వద్ద జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, ఆదూరు రత్నం, శ్రీనివాసులు, పౌలు, సుందరం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, తిరుపాల్, సుబ్రమణ్యం, హనుమంతరావు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటాచలపతి, ఎమ్మార్పీఎస్ నాయకులు సారథికుమార్, చంద్రబాబు, చెంగమ్మ తదిరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలో త్రిభువని సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, ఎంపీపీ తనూజారెడ్డి, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ నాయకులు పునుగోటి విశ్వనాథ నాయుడు, బీరం రాజేశ్వరావు, శ్రీనివాసులు నాయుడు, తోట రామచంద్రయ్య, మంకు ఆనంద్, మల్లారం బాబు, రాపూరు శ్రీనివాసులు, చెంగారావు, నర్సింహులు పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకుర్పాణ





గూడలి పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారి పుట్టబంగారం - అఖండ దీపం వెలిగిస్తున్న కార్తీక్‌శర్మ

కోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంగమే శ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంకుర్పా ణతో ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు స్వామివారి పుట్ట బంగారం, ఉత్సవ విగ్రహాలతో మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వ ర్యంలో ప్రధానార్చకులు కార్తీక్ శర్మ అఖండ దీపం వెలిగించి యువకులకు కంకణాలు కట్టారు. ఆదివారం ధ్వజారోహణం జరుగుతుంది.

హామీలన్నీ నెరవేరుస్తాం: పాశిం

కోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చడం జరుగు తుందని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొక్కుపాడులో టీడీపీ సీనియర్ నేత పలగాటి భాస్కర్‌రెడ్డి నివాసంలో శనివారం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీనియర్ నేతలతో సమీక్ష నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, తెలుగు రైతు కార్యదర్శి మోహన్‌రెడ్డి, సురేష్‌బాబు, వాకా విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, వెంకన్నపాళెం సర్పంచ్ కోకర్ల మధుయాదవ్, పోలయ్య, జితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



బాలకృష్ణారెడ్డి (ఫైల్‌ఫొటో)

తడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలమలుగు గ్రామానికి చెందిన వేనాటి బాలకృష్ణా రెడ్డి(93) శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజా సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి అందజేశారు.

15, 16 తేదీల్లో ఓపెన్ క్యారమ్ టోర్నమెంట్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని కాస్మోపాలిషియన్ క్లబ్‌లో ఈనెల 15, 16 తేదీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా ఓపెన్ క్యారమ్ టోర్నమెంటు నిర్వహించ నున్నట్లు క్లబ్ ప్రతినిధులు శనివారం తెలిపారు. మొదటి బహుమతిగా రూ.4వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2 వేలు, నాలుగో బహుమతి రూ.1000 అందజేస్తామన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో పోటీలను నిర్వహిస్తామని, వివరాలకు 9885835526 (సుధాకర్), 9490776867(ప్రసన్నకుమార్) నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నేడు స్థానికుల దర్శన టోకెన్ల జారీ

తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి స్థానికుల కోటా దర్శనంలో భాగంగా ఆదివారం స్థానికులకు దర్శన టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. తిరుపతివాసులకు మహతి ఆడిటోరియంలో, తిరుమల స్థానికులకు బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చినవారికి మొదటి ప్రాతిపదికన ఉదయం 5 గంటల నుంచి జారీ చేస్తారు. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానికులు ఆధార్‌కార్డు ద్వారా ఈటోకెన్లు పొందవచ్చు.

మద్యం సేవిస్తున్న యువతకు కౌన్సెలింగ్

రామచంద్రాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఐపీఎస్ హేమంత్ అన్నారు. శనివారం రామచంద్రాపురం మండలంలోని కొత్తనెన్నూరు సమీపంలో నాంకాలు వద్ద యువకులు మద్యం సేవిస్తున్నట్లు తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఎమ్మెల్యే పులివర్తి నానికి బాధితులు ఫిర్యాదు చేశారు. ఆయన సూచనతో పోలీసులు శనివారం యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

మహిళకు కుట్టుమిషన్ వితరణ

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో ఓ మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. శనివారం ఆ సంస్థ కార్యా లయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన సుప్రియకు జీవనోపాధి కల్పించేందుకు ప్రగతి సేవా సంస్థ కుట్టు మిషన్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్ర మంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్, శ్రీనివాసులు, రాము, నాగరాజు, సంపూర్ణ, దీప్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు

గూడూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావస రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ తనూజ, అనిత, జానాసుధీర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

వాకాడు, ఏప్రిల్ 5 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తన నివాసం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ అత్యధిక స్థానాలు గెలుచుకుందన్నారు. కార్యక్రమంలో పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ఎస్పీ తనిఖీలు



జీఎన్సీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రాజు

తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్ద శనివారం రాత్రి జిల్లా ఎస్పీ, టీటీడీ సీవీఎస్వో హర్షవర్ధన్‌రాజు తనిఖీలు నిర్వహించారు. తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే వాహనాలకు అలిపిరిలో ఇస్తున్న టోకెన్లను, వాటి టైమింగ్స్‌ను పరిశీలించారు. అలాగే సెక్యూరిటీ స్కానింగ్ విధానాన్ని కూడా తనిఖీ చేశారు. తనిఖీ చేసే సమయంలో భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. టోల్‌గేట్ వద్దనున్న సీసీ కెమెరాలు, వాటి పనితీరు గురించి అధికారులతో ఆరా తీశారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐ హరిప్రసాద్, ఏవీఎస్వో శైలేంద్రబాబు తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

చంద్రగిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, పనపాకం వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడుకి తీవ్ర గాయాలయ్యాయి.

శ్రీకృష్ణుడిగా శ్రీరాముడు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీరాముడు శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకచర్ల రమేష్ తెలిపారు.

వైసీపీ నాటకాలను ప్రజలు నమ్మరు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్‌వర్మ తదితరులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీ నాయకుల నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహయాదవ్ మాట్లాడుతూ టీడీఆర్ బాండ్లపై బాధితులు తమ సమస్యలు చెప్పుకుంటుంటే దానికి కారణమైన వ్యక్తులు నాటకాలు ఆడడం తగదన్నారు. టీటీడీ మాజీ చైర్మన్ సివిల్ వర్క్స్ పేరుతో రూ.1600 కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. టీడీఆర్ బాండ్లపై విచారణ జరుగుతుందన్నారు. డబుల్ డెక్కర్ పేరుతో తిరుపతి పచ్చదనాన్ని నాశనం చేశారన్నారు. వేసి రోడ్లు నాణ్యత లేకుండా వేశారని, తుడా నిధులు రూ.320 కోట్లు వృథా చేశారని ఆరోపించారు. డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ మాట్లాడుతూ దర్శన టికెట్లు అమ్ముకోవడం, దేవుడి సొమ్మును, ప్రజల సొమ్మును లూటీ చేయడంపై నాటకాలు ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, జగన్నాథం, సుబ్రహ్మణ్యం, జయరాం, జగ్గ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర నాయుడు తదితరులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై బండ వేసిందని తిరుపతి టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువలు, ప్రభుత్వ స్థలాలు, యజమానుల అనుమతి లేకుండా రోడ్లు వేసి టీడీఆర్ బాండ్ల రూపంలో రూ.200 కోట్లు దోచేశారని ఆరోపించారు. మీ నాటకాలు ప్రజలు మరవకుండా 63వేల ఓట్లతో ఓడించి ఇంటికి పంపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిశేఖర్ రాయల్, బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరామయ్య, రామమూర్తి, ఆముదాల తులసీరామ్, ఆనంద్ యాదవ్, శ్రీనివాసులు, అశోక్, యువరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోంస్టే నిర్వాహకుల మధ్య ఘర్షణ

నలుగురికి తీవ్ర గాయాలు ● ఇరువర్గాలపై కేసు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రెండు హోంస్టేల నిర్వాహకుల నడుమ ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. చింతలచేనులో డెక్కన్ సూట్స్ పేరుతో స్టే హోం నిర్వహిస్తున్న కలికిరి నవీన్‌కుమార్ రెడ్డి, అతని స్నేహితులు నరేష్‌కుమార్, హోటల్ మేనేజర్ లక్ష్మీనారాయణలు ఆరుబయట నిలుచుని ఉన్నారు. డెక్కన్ సూట్స్‌కు ఎదురుగా గరుడ ఇన్ హోం స్టే ఉంది. దీన్ని నిర్వాహకుడైన పవన్‌కుమార్ తన స్నేహితులు మధుశేఖర్, మరికొంత మంది తమ స్టే హోంకు వచ్చే వారిని ఎందుకు తీసుకెళుతున్నారని డెక్కన్ సూట్స్ వారితో గొడవకు దిగారు. ఈ క్రమంలో కత్తులు, రాడ్లు, కర్రలు తీసుకుని దాడులు చేశారు. నవీన్‌కుమార్‌రెడ్డి, నరేష్‌కుమార్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. లక్ష్మీనారాయణ గాయపడ్డాడు. సీఐ రామకృష్ణ, ఎస్ఐలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నవీన్ కుమార్, నరేష్‌కుమార్‌లను తిరుపతి రుయాకు తరలించారు. పవన్‌కుమార్, మధుశేఖర్‌తో పాటు మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. అదేవిధంగా గరుడ ఇన్ స్టేహోం యజమాని పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు నవీన్, పణీంద్ర నరేష్‌పై కేసు నమోదు చేశారు.

తాతయ్యగుంట ఆలయానికి రూ.లక్ష విరాళం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి శనివారం రూ.లక్ష విరాళం అందింది. తిరుపతికి చెందిన శ్రీసాయిరాం టిఫెన్ సెంటర్ కె.నీలకంఠరెడ్డి, కుటుంబ సభ్యులు కలిపి రూ.1,11,116 విరాళాన్ని ఆలయ ఈవో జయకుమార్‌కు అందజేశారు.

కోదండరామాలయంలో నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోదండ రామాలయంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 6న ఉదయం మూలవర్లకు అభిషేకం, స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం రామనవమి ఆస్థానం, రాత్రి హనుమంత వాహన సేవ జరగనుంది. 7న సీతారాముల కల్యాణం, 8న శ్రీరామ పట్టాభిషేకం జరగనున్నాయి. 9న సాయంత్రం వసంతోత్సవం, 10 నుంచి 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఘనంగా జగ్జీవన్‌రాం జయంతి




శ్రీరామ్‌నగర్‌కాలనీలో, బీఎన్‌కండ్రిగలో నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో సంఘ సంస్కర్త, మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప పాల్గొన్నారు. పట్టణం లోని బాబు అగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జరిగాయి.



రేణిగుంట తహసీల్దార్ కార్యాలయంలో...

రేణిగుంట(ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రాం జయంతిని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ నాయక్, తహసీల్దార్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి తహసీల్దారు రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు. ● అలాగే కేవీబీపురం మండల కేంద్రంలో, బుచ్చినాయుడు కండ్రిగలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో, పిచ్చాటూరు తహసీల్దార్ కార్యాలయంలో కూడా జగ్జీవన్‌రాంకు ఘనంగా నివాళులర్పించారు.

హోం మంత్రి అనితకు ఘనస్వాగతం



రేణిగుంట, ఏప్రిల్ 5, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖ మంత్రి అనితకు రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం శనివారం మధ్యాహ్నం విజయవాడ నుంచి వందే భారత్ రైలులో బయలుదేరి రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్న హోంమంత్రికి రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య, టీడీపీ నాయకులు బి.వెంకట్రాయులు, పసల ధనశేఖర్, పి.సురేంద్ర రాజు, ముని సుబ్రమణ్యం తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీ శ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశపూజలను చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంక రించించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు దర్శించుకున్నారు.

పుత్తూరు వార్తలు

ఏఎంసీ చైర్మన్ గణేష్‌కు ఘనసన్మానం



గణేష్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా డీఎస్ గణేష్ నియామకం పట్ల ప్రశంసలు వెల్లువెత్తాయి. శనివారం ముస్లిం మత పెద్దలు గణేష్‌ను సత్కరించారు. పార్టీకి విశ్వాసంగా పని చేసినందుకు తగిన గుర్తింపు లభించిందని వారు హర్షం వ్యక్తం చేశారు. గేట్ పుత్తూరు మసీదు ఏ ముఖద్దస్ ముతవల్లీ మహమ్మద్ గౌస్, చిత్తూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.కే.షబ్బర్, హమీద్‌బాషా, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీశంకర ఆలయంలో మహాశివుడి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం ఉదయం మహాలింగానికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిగింది. రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు శివ, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్ర, శాంతి హోమాలు జరిగాయిరు. లింగాన్ని పూలమాలలతో విశేషంగా అలంకరించి మంగళ హారుతలిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం జరిగింది.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయనాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలలో అధిష్ఠింప జేసి వేదమంత్రాలు, భక్తులు గోవింద నామస్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత శ్రీవారు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): విశాంత్ర ఉద్యోగుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణంలోని విశ్రాంత సంఘ భవనంలో శనివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గుణశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుప్పయ్య, కోశాధికారిగా రామలింగం, గౌరవాధ్యక్షుడిగా యుగంధర్‌రాజు, ఉపాధ్యక్షులను, కార్యదర్శులను, 16 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర బాధ్యుడు జయరాంనాయుడు, జిల్లా అధ్యక్షుడు శంకర్ సమక్షంలో కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది.

బడుగు వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రాం



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రాం అని అంబేడ్కర్ ట్రస్ట్ కార్యదర్శి అపరంజి, కుప్పయ్య పేర్కొన్నారు. శనివారం మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్‌రాం 118 జయంతి వేడుకలను అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించారు. బాలసుబ్రమణ్యం, ప్రభాకర్, విజయ్‌కుమార్, రాజేందర్, ధనపాల్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సోమువీర్రాజుకు సత్కారం



పుత్తూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ సోమువీర్రాజును చిత్తూరు నగరంలోని గిరింపేటలో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. నాయకులు పొన్నప్పన్, మధు, మునస్వామి, హరి, సౌందర్య, భువనేశ్వరి, మీరా తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పెద్ద కొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం నుంచి 12వ తేదీ వరకు పెద్దకొట్టాయి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. స్వామి అమ్మవార్లు ప్రతి రోజు సాయంత్రం 7గంటలకు ఆలయ అలంకార మండపం నుంచి బయలుదేరి కోట మండపం వద్ద మూడు ప్రదక్షిణలు చేస్తారు.

ఇదేం పాపం!

భక్తుల పాదరక్షణ కోసం ఎర్ర తివాచి ఏర్పాటు
దానిపై ఆటోల పార్కింగ్



తివాచీపై పార్కింగ్ చేసిన ఆటో

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయ సమీపంలోని సన్నిధి వీధిలో కొందరు ఆటోడ్రైవర్ల తీరు అభ్యంతరకరంగా మారుతోంది. ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాలు ఉన్న విషయం తెలిసిందే. దర్శనానికి వెళ్లే సమయంలో తమ పాదరక్షలను భద్రపరచుకుని ఆలయంలోకి ప్రవేశిస్తుంటారు. దర్శనానంతరం వెలుపలకు వచ్చాక సన్నిధివీధి నుంచి భక్తులు తమ లగేజీ, చెప్పులు భద్రపరచుకునే చోటుకు వెళ్లాల్సి ఉంటుంది. యేటా వేసవిలో సన్నిధివీధిలో సిమెంటు రోడ్డుపై పాదరక్షలు లేకుండా నడిచే భక్తులకు తీవ్ర అవస్థలు ఎదురయ్యేవి. ఎండ సమయంలో కాళ్లు కాల్చుకుంటూ పరుగులు తీసేవారు. ఈ యేడాది అలాంటి సమస్యను పరిష్కరించేందుకు వినూత్న ఆలోచనకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. నాల్గో గేటు నుంచి రెండో గేటు వరకు సన్నిధి వీధిలో సిమెంటు రోడ్డుపై కొబ్బరి నారుతో చేసిన ఎర్ర తివాచిని పరిచారు. భక్తుల కాళ్లు కాలకుండా ఉండాలన్న ఆలోచనతో దీన్ని ఏర్పాటు చేశారు. అయితే సన్నిధివీధి స్నానఘట్టాల వద్ద ఆటోపార్కింగ్ కోసం అధికారులు స్థలాన్ని కేటాయించారు. కానీ కొందరు ఆటో డ్రైవర్లు అందుకు విరుద్ధంగా ఎక్కడిపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. శనివారం స్నానఘట్టాల వద్ద ఆటో పార్కింగ్ ఎదురువైపున ఉన్న తివాచిపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేశారు. అందులో కొందరు ఆటో డ్రైవర్లు చేరి సెల్‌ఫోన్‌లో లుడో(దాయాలు)ను పెట్టుకుని బాహాటంగా జూదం ఆడుతూ గడిపారు. తివాచిపై ఆటో అడ్డంగా ఉండటంతో భక్తులు అవస్థలు పడ్డారు. కొందరు ప్రశ్నించిన భక్తులకు ఆటో డ్రైవర్లు దురుసుగా సమాధానం చెప్పారు. ఈ తరహాలో తివాచిలో అడ్డదిడ్డంగా వాహనాలను నిలపడం ద్వారా భక్తుల సౌకర్యం కోసం చేసిన ఏర్పాటు వ్యర్థంగా మారుతోంది.

సీనియర్ నాయకులకు ఎమ్మెల్యే పరామర్శ



సుబ్రహ్మణ్యంరెడ్డిని పరామర్శిస్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్ నాయకులను ఎమ్మెల్యే సుధీర్ శనివారం పరామర్శించారు. చెలికం పాపిరెడ్డి కంటి శస్త్రచికిత్స చేసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను ఎమ్మెల్యే పరామర్శించారు. అదే విధంగా కాలి శస్త్రచికిత్స చేసుకున్న సుబ్రహ్మణ్యంరెడ్డిని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. విజయకుమార్, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఆర్టీఏ సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా సురేష్



సురేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలానికి చెందిన ఎస్.ఎం.సురేష్ ఉమ్మడి జిల్లా సమాచార హక్కు చట్టం(ఆర్టీఏ) సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. సురేష్‌కు ఆ పదవి రావడంతో ఎమ్మెల్యే ఆదిమూలం అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పిచ్చాటూరు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, వాసురెడ్డి, పద్దురాజు, మాజీ ఎంపీపీ మురళి, నారాయణ, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంగుణోత్తర ఉత్సవం



అమ్మవారి ఊంజల్ సేవ

నారాయణవనం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పంగుణోత్తర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను 11వ తేది వరకు ఏడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయాధికారి తెలిపారు. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులను అనుగ్రహించారు. ఉదయం అమ్మవారికి, స్వామివారికి నిత్య కైంకర్యాల అనంతరం అమ్మవారికి ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవర్లను అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఊంజల మండపంలో అమ్మవారిని ఊయలపై కొలువుదీర్చి ఊంజల సేవను నిర్వహించారు. పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం పద్మావతి అమ్మవారికి ప్రత్యేక సర్కారు అభిషేకం, సాయంత్రం గంట పాటు ఊంజలసేవ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో చివరి రోజైన 11వ తేది శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల ఏకాంతసేవను అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తారు. మరుసటి రోజు ఆదివారం ఉదయం సుప్రభాతసేవను నిర్వహిస్తారు. పంగుణోత్తర ఉత్సవాల సందర్భంగా నిత్య కల్యాణంతో పాటు శుక్ర, శనివారాల్లో నిర్వహించే ఊంజలసేవలను రద్దు చేసినట్లు తెలిపారు. ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేపై బురద చల్లడం మానుకోండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కేవీబీపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేపై బురద జల్లడం మాని అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీహరియాదవ్ కోరారు. కేవీబీపురంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. సొంతపార్టీకి చెందిన నాయకులు ఆరోపణలు చేయడం మానాలన్నారు. ఎమ్మెల్యేగా ఆదిమూలం బాధ్యతలు చేపట్టిన తరువాత మండలాభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తున్నారన్నారు. కొత్త ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యేలు హేమలత, ఆదిత్యను నియమించాలని కోరిన వారే తరువాత వద్దన్నారని గుర్తు చేశారు. అలాగే జేడీ రాజశేఖర్‌ను తిరస్కరించారన్నారు. మణి, సర్పంచ్ బాలాజీ, కేశవులునాయుడు, అయ్యప్ప, చెంగారెడ్డి, పరంధామరెడ్డి, బీజేపీ మండల నాయకుడు బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాటూరి జయంతి వేడుకలు



రాజగోపాల నాయుడికి నివాళులు

తవణంపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ పాటూరి రాజగోపాలనాయుడు 105వ జయంతి వేడుకలను తవణంపల్లె మండలంలోని దిగువమాఘం రాజన్న పార్కులో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్ర నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌నాయుడు విగ్రహానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, గల్లా దంపతులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే గల్లా అరుణకుమారి మనవడు, సినీ హీరో అశోక్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి.. వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. రాజగోపాల్‌నాయుడు జీవితం ఎందరికో ఆదర్శమని, విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, స్థానిక సర్పంచ్ గోపితోపాటు పలువురు టీడీపీ నాయకులు, దిగువమాఘం గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజేఐకి ఘన స్వాగతం

రేణిగుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి భీమారావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన రాజు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ సురేష్‌బాబు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

మాజీ ఉప రాష్ట్రపతికి సాదర స్వాగతం

రేణిగుంట, ఏప్రిల్ 5, (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడికి సాదర స్వాగతం లభించింది. శనివారం ఉదయం హైదరాబాదు నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, టీటీడీ పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన నెల్లూరు జిల్లా వెంకటాచలానికి బయలుదేరి వెళ్లారు.

ఉపాధిహామీలో పశువులకు నీటి తొట్టెలు



భూమిపూజలో టీడీపీ నాయకులు

కేవీబీపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరు పంచాయతీలో ఉపాధి పథకంలో పశువులకు నీటితొట్టెల నిర్మాణం కోసం శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, అంజూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపిరెడ్డి, తెలుగుమహిళ అధ్యక్షురాలు పావని, మాజీ సర్పంచ్ ముకేష్, కమిటీ అధ్యక్షుడు సుధ, ఏపీవో భాస్కరయ్య, జేఈ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీకి ఘనస్వాగతం



శక్తికాంతదాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంత దాస్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం ఉదయం శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ఢిల్లీ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న శక్తికాంతాదాస్‌కు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ సురేష్ బాబు ఘనస్వాగతం పలికారు.

ముక్కంటి సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ రవి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్, న్యాయమూర్తులు బేబీరాణి, ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.